భూమికి సారం.. పశువుల ఎరువులతో సాకారం

వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోవడంతో నేలలోని పోషక నిల్వల్లో సమతుల్యం లోపించి ఉత్పాదకత తగ్గుతోంది. చీడపీడలు ఆశించడం, సూక్ష్మ పోషకాల లోపాలతో దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ సమస్యను అధిగమించాలంటే సేంద్రియ పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పేర్కొంటున్నారు.

- రసాయన ఎరువులతో నిర్జీవంగా మారుతున్న భూములు
- సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు


కోవూరు మండలం పడుగుపాడులో నిల్వ ఉంచిన పశువుల ఎరువు

కోవూరు : గ్రామాల్లోని పశువులు, మేకలు, గొర్రెల ఎరువులు పంటల సాగులో ఎంతగానో ఉపయోగపడుతోంది. ఇది సేంద్రియ ఎరువులతో సమానం. దీనిని దుక్కులకు ముందే పంట భూముల్లో వేసి దున్నితే చాలా మంచిది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి వీలవుతుంది. దుక్కులు దున్నిన తర్వాత పశువుల పేడ మొత్తం భూమిలోకి వెళ్లి పంట దిగుబడిని పెంచడానికి దోహదపడుతుంది. పంట ఎదుగుదల, మొక్కలు బలంగా ఉండేందుకు పశువుల ఎరువు ఉపయోగపడుతోంది. ఒక ఎకరానికి నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్ల పశువుల ఎరువును వినియోగించాలి.

ఇలా చేయాలి

అధిక దిగుబడులు ఆశించి రైతులు విచక్షణా రహితంగా రసాయన పురుగు మందులు వాడటం వల్ల భూములు నిర్జీవంగా మారుతున్నాయి. బహుళ ప్రయోజనకారులైన సూక్ష్మజీవులు నశించడం వల్ల వాటి ద్వారా లభించే సేంద్రియ పదార్థాలు, సూక్ష్మ పోషక పదార్థాలు పూర్తిగా అదృశ్యమవుతున్నాయి. దీని వల్ల మొక్కల్లో ఎదుగుదల నశిస్తుంది. ఉద్యాన పంటల్లో సమగ్ర యాజమాన్యాన్ని రైతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. ముఖ్యంగా ఉద్యాన పంటల్లో 50 శాతం సేంద్రియ, 50 శాతం రసాయన ఎరువులు వాడితే మంచి దిగుబడులు పొందవచ్చని ఉద్యానశాఖాధికారిణి సూచిస్తున్నారు. వీటిల్లో మొక్కలకు కావాల్సిన ప్రధాన పోషకాలైన జింక్, మెగ్నీషియం, మాంగనీస్, బోరాన్ తదితరాలు పుష్కలంగా దొరుకుతాయి. తక్కువ ధరలో ఎక్కువ పోషకాలు లభించే ఏకైక సేంద్రియ ఎరువు కోళ్ల ఎరువు మాత్రమే. కోళ్ల ఎరువులో నత్రజని 3 శాతం, భాస్వరం 2.5 శాతం, పొటాష్ 1.2 శాతం ఉంటాయి. ఉద్యాన పంటలైన కూరగాయల పంటలకు ఎకరానికి 500 కేజీల కోళ్ల ఎరువు సరిపోతుంది. ఈ ఎరువును రసాయన ఎరువుతో కలిపి వాడితే 20 నుంచి 25 శాతం నత్రజని ఆదా చేయవచ్చు.


కుప్పలుగా వేసిన పశువుల పేడ

పశువుల ఎరువుతో భూసారం పెంపు

పశువులు, మేకలు, గొర్రెల ఎరువులు వేయడం వల్ల భూసారం పెరుగుతుంది. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు తప్పక పాటించాలి. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తే భూమికి మేలు

– వ్యవసాయశాఖ ఏడీ, సుజాత

భూసారం పదిలం

సాధారణంగా రైతులు వేసవిలో పశువుల ఎరువును వ్యవసాయ పొలాలకు తరలిస్తుంటారు. అదే సమయంలో ఎండలు ఎక్కువగా ఉంటాయి. అధిక ఎండల కారణంగా పోషకాలు ఆవిరవుతాయి. దీనిని నివారించేందుకు పశువుల పేడను పొలంలో కుప్పలు పోసుకోవాలి. భూమిలో తగిన తేమ ఉన్న సమయంలోనే వెదజల్లి వెంటనే దుక్కిలో కలియదున్నాలి. దీని వల్ల భూసారం పెరుగుతుంది. నేలలోని ఆమ్లత్వం, క్షారత్వం, నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపు చేసి పోషకాలు మొక్కలకు అందే విధంగా సహాయపడుతాయి. దీంతో రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చు.

క్లుప్తంగా

ఓటుకు నోటుపై విచారణ జరిపించాలి

నెల్లూరు(బృందావనం) : ఓటుకు నోటు పంపకంపై విచారణ జరిపించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్స్ సొసైటీ అధ్యక్షుడు ఎన్.మస్తానయ్య తెలిపారు. విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో ఏపీ అదనపు ప్రధాన ఎన్నికలాధికారి పి.కోటేశ్వరరావును ఆయన బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మస్తానయ్య మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో ఓట్లను కొనుగోలు చేశారంటూ వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని, తదుపరే ఓట్ల లెక్కింపు చేపట్టాలని విన్నవించినట్లు తెలిపారు.

జాతీయ స్కాలర్‌షిప్‌కు ఎన్‌సీసీ క్యాడెట్స్


స్కాలర్‌షిప్ చెక్కులను అందజేస్తున్న ఎన్‌సీసీ ఆఫీసర్ గణేష్ తదితరులు

నెల్లూరు(అర్బన్) : స్థానిక బీవీనగర్‌లోని కేవీఆర్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన నెల్లూరు పది ఆంధ్రా నేవల్ యూనిట్ ఎన్‌సీసీ క్యాడెట్లు జాతీయ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖ నేషనల్ క్యాడెట్స్ కార్ప్స్ నుంచి మెరిటోరియస్ స్కాలర్‌షిప్స్–2023కి కేఎన్నార్ పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు సాయిచరణి, బొప్పూరి వకుళ ప్రవీణ్, కీర్తిపాటి హిమవర్షిణి, మద్దెల మహీధర్, సాధినేని వెంకటసహస్ర, కంచర్ల వెంకటదినేష్ ఎంపికయ్యారు. ఈ మేరకు వీరికి స్థానిక కొండాయపాళెం స్నేహనగర్‌లోని ఎన్‌సీసీ కార్యాలయంలో బుధవారం మెరిటోరియస్ స్కాలర్‌షిప్ చెక్కులను లెఫ్టినెంట్ కమాండర్, కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గొడంగవే, సెకండ్ ఆఫీసర్, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కేఎస్‌ఆర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయప్రకాష్ విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

తూపిలి రామ్మోహన్‌కు నివాళి


రామ్మోహన్ చిత్రపటానికి నివాళి అర్పించిన ఏపీయూడబ్ల్యూజే నాయకులు

నెల్లూరు(మినీబైపాస్) : నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్ట్ తూపిలి రామ్మోహన్‌కు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో బుధవారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సంఘ రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా ప్రింట్ మీడియా అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, కార్యదర్శులు మస్తాన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సుదీర్ఘకాలం జర్నలిస్టుగా వివిధ పత్రికల్లో ఎంతో నిబద్ధతతో విధులు నిర్వహించడమే కాకుండా జర్నలిస్టు సమస్యలపై ఏపీయూడబ్ల్యూజే నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడిగా, స్టేట్ కౌన్సిల్ సభ్యుడిగా పలుసేవలు అందించారని కొనియాడారు. ఆయన మరణం తీరనిలోటు అని తెలిపారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు రమేష్‌బాబు, సామ్నా అధ్యక్షుడు సర్వేపల్లి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

ఆత్మకూరు: పట్టణంలోని సీహెచ్‌సీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 110 మందికిపైగా రోగులు వైద్య సేవలు పొందారు. డాక్టర్ అస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుగర్ బీపీ, తదితర వ్యాధులకు చికిత్సలు అందించారు. డాక్టర్ అస్మా మాట్లాడుతూ గతంలో వైద్య సేవలు పొందిన వారికి ఫోన్ ద్వారా సమాచారం పంపామని, మందులు కావాల్సిన వారికి ఉచితంగా అందజేసినట్లు ఆమె తెలిపారు. కొత్తగా వైద్యసేవలు అందిన వారికి ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేలా ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది కృషి చేస్తుననట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన ఉత్సవాలు

ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లెలో బుధవారం సీతారాముల ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఆలయ అర్చకులు స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహ వచనం, నవగ్రహ మండపారాధన, కలశస్థాపన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు గ్రామంతో పాటు, పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని మెక్లిన్స్ రోడ్డు విరాట్‌నగర్‌లో ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం 331వ ఆరాధన మహోత్సవం జరుగుతుందని నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరు చంగయ్య ఆచారి బుధవారం తెలిపారు. ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సుప్రభాత సేవ, అభిషేకాలు, చందనాలంకారం, గణపతి పూజ, పుణ్యాహవచనం, బ్రహ్మకలశ సకల దేవతల ఆహ్వానం, సమాధి పూజ, మూర్తి హోమం, సహస్రనామార్చన జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకరణ, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

శిశువు ఎదుగుదలకు తొలినెల కీలకం

- చిన్న పిల్లల వైద్యుడు రవికుమార్

నెల్లూరు(అర్బన్) : పుట్టిన శిశువు ఎదుగుదలకు తొలినెల కీలకమని రిచ్ ఆస్పత్రి ఎండీ, చిన్న పిల్లల వైద్యుడు రవికుమార్ తెలిపారు. ప్రపంచ కంగారు మదర్ కేర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పొగతోటలోని రిచ్ ఆస్పత్రిలో బాలింతలు, సహాయకులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ పుట్టిన పిల్లలకు తల్లి స్పర్శ ఎంతో ముఖ్యమన్నారు. కంగారు జంతువు తన బిడ్డను పొట్టలో దాచుకోవడం వల్ల ఆ బిడ్డకు ఎంతో హాయిగా ఉంటుందని, ధైర్యం వస్తుందన్నారు. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ తల్లి ప్రాముఖ్యతను వివరించేందుకు కంగారు మదర్ కేర్ అవగాహన దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తోందన్నారు. తల్లి చర్మం మీద ఏమైనా గాయాలు, దద్దుర్లు ఉన్నప్పుడు కంగారు కేర్ ఇవ్వరాదన్నారు. ఇలాంటి కేర్ తల్లి మాత్రమే కాకుండా అమ్మమ్మ, నానమ్మ, తండ్రి ఎవరైనా ఇవ్వవచ్చన్నారు. తల్లి స్పర్శ బిడ్డకు స్వాంతన చేకూర్చుతుందన్నారు. కార్యక్రమంలో పిల్లల డాక్టర్లు నవ్యశ్రీ, హరీషా, అమృత, సీఈవో భాస్కర్ మేనేజర్ ఆనంద్, పలువురు తల్లులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం


సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు

విడవలూరు : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే సర్వసభ్య సమావేశ ముఖ్య లక్ష్యమని ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రమైన విడవలూరులోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని, ఈ కార్యక్రమానికి హాజరైన అన్నిశాఖల అధికారుల నుంచి గ్రామ సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగానే కొన్ని గ్రామాల్లో తాగునీరు, వీధి లైట్లు, శానిటైజేషన్‌పై దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ, ఎంఈఓ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఆర్టీసీ, వైద్యశాఖ పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణకు నేటి నుంచి వ్యాక్సినేషన్


మాట్లాడుతున్న డాక్టర్ నరసింహారావు


హాజరైన ఆరోగ్య సిబ్బంది

- పీహెచ్‌సీ డాక్టర్ నరసింహారావు

పొదలకూరు : క్షయవ్యాధి నివారణకు బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం గురువారం నుంచి చేపడుతున్నట్లు మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు పేర్కొన్నారు. మండలంలోని మహ్మదాపురం గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీసీజీ వ్యాక్సిన్ మోతాదు, పద్ధతులపై వైద్య సిబ్బందికి బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నరసింహారావు మాట్లాడుతూ ప్రతి గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ డేగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో బీసీజీ వ్యాక్సిన్‌ను వేస్తారని వెల్లడించారు. 18 సంవత్సరాలు పైబడిన వారితో పాటు 60 సంవత్సరాలు పైబడిన వారికి కూడా వ్యాక్సిన్ వేస్తారని వివరించారు. పొగాకు, గుట్కా నమిలేవారు, షుగర్, బీపీ, క్షయవ్యాధికి మందులు వేసుకుంటున్న వారు, క్షయవ్యాధి ఉన్న కుటుంబ సభ్యులు విధిగా వ్యాక్సినేషన్ వేయించుకోవాల్సిందిగా సూచించారు. బీసీజీ వ్యాక్సిన్ మోతాదు 0.1 ఎంఎల్ మాత్రమే ఇస్తారని తెలిపారు. క్షయవ్యాధికి మందులు వేసుకుంటున్న వారు, ఎయిడ్స్ బాధితులు, 18 సంవత్సరాల్లోపు వారు, బిడ్డకు పాలు ఇస్తున్న తల్లులు, మూడు మాసాల క్రితం రక్తం ఎక్కించుకున్న వారు వ్యాక్సిన్‌కు అర్హులు కాదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్‌రిషిత, డాక్టర్ స్రవంతి, డాక్టర్ శ్రీకావ్య తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా పోలీసుల తీరు

- వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు


పోలీసులు, ప్రైవేటు సిబ్బంది దాడిలో గాయపడిన వేణు

కోవూరు : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో పోలీసుల తీరు ఏకపక్షంగా సాగింది. ప్రతి పోలింగ్ బూత్‌లో ఒకే కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో ఒక్కో బూత్‌కు ఇద్దరు లేదా ముగ్గురు కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం అలా కాకుండా పోలీసులు వ్యవహరించారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో ఉదయం ప్రారంభమైన పోలీసుల ఏకపక్ష తీరు కోవూరు పంచాయతీలోని చుండుగుంట వరకు సాగింది. కోవూరు మండలం చుండుగుంట ప్రాంతంలో ప్రశాంతంగా జరుగుతున్న పోలింగ్‌లో టీడీపీ నాయకులు అత్యుత్సాహాన్ని అడ్డుకోకుండా వైఎస్సార్‌సీపీ నాయకులపై పోలీసులు ప్రైవేటు సిబ్బందితో కలిసి దాడులు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనలో ఇనమడుగు సెంటర్‌కు చెందిన మల్లవరపు వేణుపై లాఠీ చార్జీ చేశారు. ఇదే అదునుగా చేసుకుని ఎస్సై నియమించుకున్న ప్రైవేటు సిబ్బంది వేణు పట్ల విచక్షణారహితంగా దాడి చేయడం గమనార్హం. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇదే విధంగా పోలీసులు తీరు ఉందని పలువురు చెబుతున్నారు.

రేపటి నుంచి కోదండరాముడికి పూజలు

సీతారామపురం : మండలంలోని గుండుపల్లిలో కొలువుదీరిన సీతాసమేత ప్రసన్న కోదండరామస్వామి దేవస్థానం 11వ వార్షిక మహోత్సవాలను శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ బుధవారం తెలిపింది. 17వ తేదీ ఉదయం గణపతి పూజ, అభిషేకాలు, ప్రత్యేక హోమాలు, రాత్రికి కోలాటం, 18వ తేదీ ఉదయం సీతారాముల కల్యాణ మహోత్సవం, రాత్రికి భజన కార్యక్రమం, గ్రామోత్సవం, 19వ తేదీ పోలేరమ్మ తల్లికి సలిపిడి, పానకాలు, చద్ది, పొంగళ్ల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహోత్సవాల సందర్భంగా ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం, రాత్రికి అన్నదానం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కోదండరామస్వామి దేవస్థాన వార్షిక మహోత్సవాలు జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

చురుగ్గా ఆస్పత్రి నిర్మాణం


నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనం

మనుబోలు : మనుబోలు మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీ భవనం ఏళ్లనాటిది కావడంతో వర్షాకాలంలో అక్కడక్కడా ఉరుస్తోంది. దీంతో వైద్య సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ప్రస్తుతం ఉన్న సిబ్బందితో రోజువారీ పేషెంట్లకు చికిత్స అందించేందుకు భవనం సరిపోవడం లేదు. దీంతో 24/7 పనిచేయాల్సిన ఆస్పత్రి.. ప్రస్తుతం వసతులు సక్రమంగా లేవన్న సాకుతో సాయంత్రానికే తాళం వేస్తున్నారు. దీనివల్ల మండల కేంద్రంలో ఏదైనా ఎమర్జెన్సీ వస్తే రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం కొత్త భవనం నిర్మాణానికి రూ.1.24 కోట్లు కేటాయించింది. దీంతో భవన నిర్మాణం చురుగ్గా సాగుతోంది. కొత్త భవనం అందుబాటులోకి వస్తే 24 గంటల వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలను ప్రోత్సహించడం అందరి బాధ్యత

- డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు


రూ.30 వేల విరాళం అందజేస్తున్న చలపతిరావు

కొడవలూరు : క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు అన్నారు. విడవలూరు మండలం ముదివర్తిలో ఈనెల 18, 19వ తేదీల్లో జరిగే బత్తల సాయిరెడ్డి మెమోరియల్ చెడుగుడు పోటీలకు బుధవారం ఆయన నార్తురాజుపాళెంలో రూ.30 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం ఉంటుందన్నారు. క్రీడల నిర్వహణకు ఎవరు ముందుకొచ్చినా తనవంతు సహకారం అందిస్తానన్నారు. యువతీ, యువకులు క్రీడల పట్ల ఆసక్తి కనబరచడం ద్వారా మంచి భవిష్యత్తు పొందవచ్చన్నారు. రెండు రోజులపాటు జరిగే చెడుగుడు పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచే వారికి ఆకర్షణీయమైన బహుమతులు ప్రకటించడం అభినందనీయమన్నారు. పోటీల్లో విజేతలకు వరుసగా రూ.30 వేలు, 25 వేలు, 20 వేలు, 15 వేలు, 12 వేలు, 10 వేలు బహుమతులుగా ఇవ్వడం ద్వారా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని కొనియాడారు. చలపతిరావు వెంట ప్రసన్నకుమార్, వి.అనీల్, ఆర్.నవీన్, ఎస్.యాకోబు, ఎన్.నిరంజన్ తదితరులు ఉన్నారు.

అదానీ వరల్డ్ స్కూల్‌లో వందశాతం ఉత్తీర్ణత


సాయిహర్షిత్‌రెడ్డి ప్రియాన్ష్ దూబే విశాల్

ముత్తుకూరు : మండలంలోని గోపాలపురంలో ఉన్న అదానీ వరల్డ్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరం సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని స్కూల్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో బుధవారం మాట్లాడుతూ అదానీ వరల్డ్ స్కూల్ రెండో బ్యాచ్ విద్యార్థులు కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. కల్కి సాయిహర్షిత్‌రెడ్డి 490 మార్కులతో స్కూల్ టాపర్‌గా జిల్లాలో రెండో స్థానంలో నిలిచారని తెలిపారు. ప్రియాన్ష్ దూబే 480 మార్కులు, విశాల్ 458 మార్కులతో తరువాత స్థానాల్లో నిలిచినట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రిన్సిపల్ అభినందనలు తెలిపారు.